


ఒక్కసారిగా ఆ వార్త గుప్పుమంది.

'నిన్న నుదయం నుండి సరళ కన్పడటం లేదట'—

జానకమ్మకు మాంఛి హుషా రొచ్చింది దాన్తో!

సరళ తల్లిదండ్రుల్ని పరామర్శించ టానికన్నట్లు వెళ్ళి మరో విషయం కూడా కనుక్కుంది.

'తన బట్టలన్నీ సర్దుకొని సూట్‌కేస్‌లో పెట్టుకుని వెళ్ళిందట సరళ' —

ఇంక అప్పట్నుంచీ మొదలైంది జానకమ్మ ఆలోచన -

ఆలోచించి... చించి... చించగా, బుర్రలో బల్బ్ ఛమక్ మంటూ వెల్గింది - సరళ వాళ్ళింటి ఎదురుగా వుండే టైలర్ జాన్ కూడా రెండ్రోజుల క్రితం ఏదో పనుందని వూరెళ్ళినట్లు—

అంతే — కడుపులోని గరళాన్ని కక్కందే నిద్రపట్టదు జానకమ్మకు—

ఆ రోజు సాయంకాలానికి మరో వార్త గుప్పు గుప్పుమంది.

'సరళ కిరస్తానీ జాన్‌తో లేచిపోయిందంటూ—'

ఊళ్ళోవాళ్ళకు యింత చక్కని వార్త దొరక్క చాలా కాలమైంది—

ఇంతటి రసవత్తరమైన విషయాన్ని డిటెక్షన్ చేసి కనుక్కున్నందుకు చుట్టుప్రక్కలుండే మహిళలంతా ప్రశంసిస్తూంటే, ఫ్రీగా ఏనుగునెక్కినంత సంబరమేసింది జానకమ్మకు—

సాయంకాలము చేటలో బియ్యం పోసుకుని ఏరుతూ, ఆఫీసు నుండి యింటి కొచ్చిన రామారావుతో విషయమంతా పూస గుచ్చినట్లు చెప్పేసింది జానకమ్మ — 'కనీసం మంచినీళ్ళు కావాలా?' అనన్నా అడక్కుండా.

విషయం విన్న రామారావు నిస్త్రపోయాడు. "ఛఛ... సరళ అలాంటి పిల్లగాదే — మనిషి ఎంత బావుంటుందో, మనసు కూడా అంత మంచిది" అన్నాడు నమ్మలేనట్లుగా—

"ఆ —ఎవడికి తెల్సు? ఏ పుర్రెలో ఏ బుద్ధుందో - సినకాలం - సిదప బుద్ధులూనూ - హవ్వ - హవ్వ - ఏం పిల్లలు? ఏం పిల్లలు! మరీ బరితెగించి పోతున్నారు" అంది బుగ్గలు నొక్కుకుంటూ జానకమ్మ.

భార్య ముందు నోరెత్తలేనివాడు 'రామారావు. 'కుర్రాడికి ఉద్యోగము వచ్చి నాలుగేళ్ళయింది. ముప్ఫయి సంవత్సరాలు వస్తున్నాయి - వేరే ఊళ్ళో చెయ్యి కాల్చుకోలేక బాధపడ్తున్నాడు. నీకు నచ్చిన పిల్ల, నీవు మెచ్చిన కట్నం దొరికేసరికి వాడి వయసు ముదిరిపోతుంది" అంటూ గట్టిగా భార్యకు చెప్పలేనివాడు.

అందుకే, 'ఏం చేస్తాం? కాలమట్లా వుంది...' అన్నాడు విన్పించీ విన్పడ నట్టు గా—

"ఇదో - మీ కేదో ఉత్తరమొచ్చింది తాతయ్యా- పోస్ట్‌మేన్ మా యింట్లో పడేశాడు" అంటూ తెచ్చిచ్చింది ప్రక్కింటి వాళ్ళ పాప.

అది వాళ్ళబ్బాయి శరత్ నుండి.

'మొన్ననే కదా ఊరెళ్ళాడు - వుండేది ప్రక్క ఊళ్ళోనే నాయె! మూడు గంటల ప్రయాణం - ఇంత అర్జెంట్‌గా ఉత్తరము వ్రాయాల్సిన అవసరమేమిటబ్బా' అనుకుంటూ ఉత్తరము తెరిచి పెద్దగా చదవసాగాడు రామారావు.

"పూజ్యులైన నాన్నగారికి,

అమ్మకు,

శరత్ నమస్కరించి వ్రాయునది.

ఈ రోజు నేను రిజిస్ట్రారాఫీసులో పెళ్ళి చేసుకున్నాను. ముందుగా మీకు చెప్పనందుకు క్షంతవ్యుడ్ని. కారణాలు మీకు తెల్సినవే. మీరు క్షమించానంటే ఇంటి కొస్తాము ఇద్దరమూనూ. మీ కోడలు కూడా మిమ్మల్ని కలవాలని ఆత్రుతపడ్తోంది — ఇంతకీ చెప్పలేదు కదూ! ఆ అమ్మాయి ఎవరో కాదు - మీకు బాగా పరిచయస్తురాలే - మన వీధిలోనే వుండే లెక్కల మాష్టారమ్మాయి - సరళ - నా ఎన్నిక..."

ధడేల్‌మని శబ్దమవటంతో చదువుతున్న ఉత్తరాన్ని హఠాత్తుగా ఆపేశాడు రామారావు.

చేతిలో వున్న చేటతో సహా బియ్యం క్రింద పడిపోగా నిశ్చేష్టురాలై నిల్చుండిపోయింది జానకమ్మ!

—శరచ్చంద్ర







## సాలూరి వారి సరసం

ప్రఖ్యాత సంగీత దర్శకులు శ్రీ సాలూరి రాజేశ్వరరావుగారు ఎంతో అమాయకంగా కనిపిస్తారు పైకి. కానీ, చక్కని చమత్కారి ఆయన!

ఒకసారి ఒక ప్రొడ్యూసరుగారు ఏదో ఇంగ్లీషు పిక్చరు చూడడం కోసం ప్రోగ్రాం పెట్టుకుని రాజేశ్వరరావుగార్ని కూడా రమ్మని పిలిచారట. "రేపు సాయంత్రం మొదటి ఆటకు మీరు ఆటో వేసుకుని సరాసరి థియేటరు దగ్గరకు వచ్చెయ్యండి" అని చెప్పి వెళ్ళిపోయారట ప్రొడ్యూసరుగారు.

అనుకున్న సమయానికి థియేటరు దగ్గరకు చేరిన ప్రొడ్యూసరుగారు, ఆయన మిత్రులు రాజేశ్వరరావుగారి కోసం ఎంతసేపు ఎదురు చూసినా ఆయనగారు పత్తా లేరట. వాళ్ళకు విసుగెత్తి ఆట మొదలవుతుందని థియేటరులోనికి వెళ్ళబోతుండగా ఆటో రిక్షాలో వచ్చారట. "ఏమండీ ఇంతాలస్యం?" అనడిగిన ప్రొడ్యూసరుగారికి రాజేశ్వరరావుగారిచ్చిన సమాధానం:

"ఏం చావను సార్! మీరేమో ఆటో రిక్షాలో రమ్మని సెలవిస్తిరి. ఈ వెధవ ఆటో కోసం, టాక్సీ వేసుకుని తేనాంపేట టి. నగర్ అంతా గాలించినా దొరకలేదు! ఆఖరికి కోడంబాకం గేటు దగ్గర దొరికితే వేసుకుని వచ్చాను! పదండి బిగినవుతుందేమో పిక్చరు!" అంటూ థియేటరువేపు నడిచారట.

ఆయన మాటలకు ప్రొడ్యూసరుగారికి, వారి



మిత్రులకు పొట్టలు చెక్కలయి వుంటయ్యని వేరే చెప్పాలా!

గన్నిశెట్టి వెంకటేశ్వరరావు, గురజాల